సాక్షి
కర్నూలు
శనివారం । 17 । ఆగస్టు । 2024




కటాక్షించు.. వరలక్ష్మీ

శ్రీశైలం టెంపుల్: శ్రావణ మాసం రెండో శుక్రవారం శ్రీశైలంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. కటాక్షించు తల్లీ అంటూ పూజలు నిర్వహించారు.



పూజ్యాయ.. రాఘవేంద్రాయ

మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 18 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. శ్రీమఠం ప్రాంగణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,620
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 67
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 33,419
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 86,310

న్యూస్‌రీల్

క్వింటా వేరుశనగ రూ.7,170

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగకు గరిష్టంగా క్వింటాకు రూ.7,170 ధర లభించింది. మార్కెట్‌కు ఈ నెల 14న 1,070 క్వింటాళ్లు.. శుక్రవారం 1,820 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మరోవైపు ఉల్లి కూడా మార్కెట్‌కు రావడం పెరుగుతోంది. ఉల్లికి క్వింటాకు రూ.3,489 ధర లభించింది. పొద్దుతిరుగుడు, కందులు, కొర్రలు, మినుములు పంటలు అంతంతమాత్రంగా వస్తున్నాయి.

వేసవిని తలపిస్తున్న ఎండలు

కర్నూలు(అగ్రికల్చర్): వాతావరణంలో మార్పులతో కొద్ది రోజులుగా ఎండల తీవ్రత పెరుగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ సమయంలో సాధారణంగా 32 నుంచి 34 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉండాలి. కానీ 37 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఈ నెల 13న 36.5, 14న 36.5, 15న 37.3, 16న 36.5 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు 27 నుంచి 29 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలు, ఉక్కపోత మరో మూడు, నాలుగు రోజులు కొనసాగే అవకాశం ఉంది.

ఐదేళ్ల లక్ష్యాలతో జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఐదేళ్ల లక్ష్యాలతో జిల్లా అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించుకోవాలని అధికారులను కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే వర్క్‌షాపునకు 45 శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రణాళికల రూపకల్పనలో పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాల పెంపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. జేసీ బి. నవ్య మాట్లాడుతూ..ఆగస్టు 20 నాటికి ప్రణాళికలను రూపొందించాలన్నారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, సీపీఓ హిమ ప్రభాకరరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ భారతి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, ఏపీఐఐసీ జెడ్ఎం సోమశేఖరరెడ్డి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, డీసీఓ రామాంజనేయులు, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులు కొన్నా, అమ్మినా నేరమే

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ప్రచురించిన, ప్రకటించిన ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వక్ఫ్ బోర్డుకు చెందిన భూములు/ఆస్తులను అమ్మినా, కొనుగోలు చేసినా చట్టప్రకారం నేరమని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ ఏ.సునీల్‌కన్నా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గెజిట్‌ను ఉల్లంఘిస్తే సెక్షన్ 22ఏ రిజిస్ట్రేషన్ యాక్ట్ 19 ఆఫ్ 2007 ప్రకారం అమ్మిన వారు, కొన్న వారు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. వివరాల కోసం కర్నూలు వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కొందరు తప్పుడు సర్వే నంబర్లు వేసి భూములను రిజిస్ట్రేషన్ చేయించి మోసం చేస్తున్నారని, అలా ఎవరూ మోసపోవద్దని అప్రమత్తం చేశారు.

పచ్చ రంగులు వేసి.. ప్రజాధనం లూటీ చేసి



ఇది కర్నూలు పెద్దాసుపత్రిలోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ఎదుట ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్. బాగున్న ఈ భవనానికి మరమ్మతుల పేరిట ప్రస్తుత ప్రభుత్వం రూ. 11 లక్షలు ఖర్చు చేస్తోంది. 'పచ్చ' రంగులు వేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



ఇది కర్నూలు కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్. ఇప్పటికే ఉన్న నిర్మాణానికి రిపేర్లు, నామమాత్రపు పనులు చేపట్టేందుకు ప్రస్తుత ప్రభుత్వం ఏకంగా రూ.10 లక్షలు ఖర్చు చేస్తోంది. ప్రజల డబ్బును దుబారా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

- టీడీపీ నాయకులకు అన్న క్యాంటీన్ల మరమ్మతులు
- అంచనాలు పెంచి.. షార్ట్ టెండర్లతో పనులు చేయిస్తున్న వైనం
- రూ.1.05 కోట్లతో పట్టణాల్లో 12 అన్న క్యాంటీన్ల ఏర్పాటు
- త్వరలో ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం



ఇది తుగ్గలి మండలంలోని శభాష్‌పురం గ్రామ సచివాలయం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.20 లక్షలు వ్యయం చేసి దీనిని నిర్మించింది. ఇక్కడ గ్రామ స్థాయిలో ప్రజలకు అవసరమయ్యే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

ఇది తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామంలో రూ. 23 లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు భరోసా కేంద్రం. రైతుల కోసం గత ప్రభుత్వం కొత్త భవనాన్ని నిర్మించింది. ఇందులో అన్ని వసతులు కల్పించింది. అన్నదాతలకు అన్ని రకాల సేవలు అందించే వెసులుబాటు కల్పించింది.



కర్నూలు (టౌన్): అధికారంలోకి వచ్చిన వెంటనే 'సూపర్ సిక్స్' అమలు చేస్తాం అంటూ హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు మాటమార్చారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని.. పథకాలు ఎలా అమలు చేయాలో అర్థం కావడం లేదని ప్రజలను మభ్యపెడుతున్నారు. మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగులకు భృతి.. ఉచిత బస్సు ప్రయాణం.. ఇలా హామీలన్నింటినీ తుంగలోకి తొక్కేందుకు యత్నిస్తున్నారు. డబ్బులు లేవంటూనే మరోవైపు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. అన్న క్యాంటీన్ల పేరుతో టీడీపీ నాయకులకు ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

షార్ట్ టెండర్లతో పక్కా వ్యూహం

జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీడీపీ నాయకులకు మేలు చేకూరేందుకు షార్ట్ టెండర్లను తెరపైకి తెచ్చింది. ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలోని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు గూడూరు నగర పంచాయతీ, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీల్లో పనులు ప్రారంభించారు. ఈ నెల 10వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని లక్ష్యాన్ని ఇచ్చారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయాల్లోనే వీటిని కొనసాగించేందుకు నిర్ణయించారు. టెండర్ ప్రక్రియ ద్వారా అయితే పనుల్లో జాప్యం జరుగుతుందని భావించి షార్ట్ టెండర్‌ను తెరపైకి తెచ్చారు. పది రోజుల వ్యవధిలో షార్ట్ టెండర్ ద్వారా టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లకే పనులు అప్పగించారు. అగ్రిమెంటు, వర్క్ ఆర్డర్ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలతో చక్కగా నిర్మించిన సచివాలయ భవనాల్లోనే వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఆధునీకరించేందుకు తమ్ముళ్ల కోసం ఒక్కో భవనానికి రూ. 10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వ్యయం చేస్తున్నారు. కొత్త పనులు చేపట్టే విధంగా అంచనాలు పెంచేశారు. ఆదోని మున్సిపాలిటీలో చక్కగా ఉన్న సచివాలయాల్లో పనులు చేపట్టేందుకు రూ.36 లక్షలు వ్యయం చేశారు. ఇక కర్నూలు కార్పొరేషన్‌లో ఒక్కో భవనానికి రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేసి పనులు చేస్తున్నారు. ఫ్లోరింగ్, ఎలివేషన్, తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, పెయింటింగ్ వంటి పనులు చేపట్టేందుకు భారీగా ఖర్చు చేస్తున్నారు. టీడీపీ నేతలకు దోచిపెట్టేందుకే నామమాత్రపు పనులకు రూ. లక్షలు కేటాయించారన్న విమర్శలు ఉన్నాయి.

రూ.1.05 కోట్లతో అన్న క్యాంటీన్లకు మరమ్మతులు

జిల్లాలో చక్కగా ఉన్న సచివాలయాల్లోనే రూ.1.05 కోట్లు వెచ్చించి అన్న క్యాంటీన్లకు మరమ్మతులు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో తక్కువ ఖర్చుతో కొత్తగా భవనాలు కడితే ప్రస్తుత ప్రభుత్వం మాత్రం మరమ్మతులు పేరుతో రూ. కోటికి పైగా నిధులు ఖర్చు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్నపాటి పనులకు రూ. 5 లక్షలు వెచ్చిస్తే సరిపోతుంది. అయితే టీడీపీ నేతల కోసం భారీగా ఖర్చు చేస్తున్నారు. కర్నూలులో కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌కు రూ. 9.4 లక్షలు, పరిమళనగర్‌లో రూ. 10.19 లక్షలు, కల్లూరు ఎస్టేట్‌లోని సెట్కూరు ఆఫీస్ వద్ద అన్న క్యాంటీన్‌కు రూ. 9.99 లక్షల ప్రకారం కేటాయించారు. త్వరలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో 5, గూడూరులో 1, ఆదోనిలో 3, ఎమ్మిగనూరులో 2 అన్న క్యాంటీన్లను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు.

కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న జూనియర్ డాక్టర్లు



నేడు 24 గంటల వైద్యసేవలు బంద్

కర్నూలు(హాస్పిటల్): పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత నగరం ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లో హత్యాచార ఘటనకు నిరసనగా కర్నూలులో జూనియర్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళన ఉద్ధృతమైంది. శుక్రవారం కలెక్టరేట్ నుంచి రాజవిహార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజవిహార్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేపట్టారు. అనంతరం తిరిగి ర్యాలీగా మెడికల్ కాలేజీలోని ధర్నా శిబిరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులకు కనీస భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆర్‌జీ కార్ హాస్పిటల్‌పై పెద్ద ఎత్తున వచ్చి దాడి చేస్తున్నా ఎవ్వరూ ఏమీ చేయలేకపోయారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యులు ఎలా విధులు నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఘటనకు నిరసనగా జిల్లాలోని అన్ని హాస్పిటల్స్‌లో 24 గంటల పాటు (శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు) సాధారణ వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కర్నూలు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.రామచంద్రనాయుడు, డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ కె.మాధవీశ్యామల తెలిపారు. కేవలం అత్యవసర కేసులు మాత్రమే చూస్తామన్నారు. కాబట్టి ప్రజలు ఓపీ కోసం ఆసుపత్రులకు రావద్దని కోరారు. ఇదిలాఉంటే జూడాల నిరసనకు ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

పేద కార్మికులకు న్యాయం చేస్తాం

- పాత వారిని కొనసాగిస్తాం
- మంత్రి టీజీ భరత్ అభివృద్ధి చేస్తే సహకరిస్తాం
- ఇష్టానుసారంగా చేస్తే ఊరుకోం
- నగర మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యుల వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): తమది పేదల ప్రభుత్వమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకవైపు చెబుతుండగా.. మరోవైపు కర్నూలులో మాత్రం మంత్రి టీజీ భరత్ పేద కార్మికుల కడుపు కొట్టడం తగదని నగర మేయర్ బీవై రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. మురుగు కాల్వలను శుభ్రం చేసే కార్మికులను పాత వారినే కొనసాగిస్తామన్నారు. వీరిని తొలగించాలని మంత్రి టీజీ చెప్పడం, సిఫార్సు లేఖలు పంపించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. కమిషనర్ విధుల్లో ఉన్నప్పటికీ మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డితో 200 మంది కార్మికులను తీసుకున్నట్లు చెప్పించారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తమను కాదని కార్మికులను తొలగించాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రహదారుల విస్తరణ చేస్తామని, స్మార్ట్‌సిటీగా కర్నూలును తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో టీజీ భరత్ హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు నగర అభివృద్ధికి రూ.10 కూడా తీసుకురాలేదన్నారు. శిలాఫలకాలు వేసిన వాటికి కొబ్బరి కాయలు కొట్టడం తప్ప ఏమీ చేయలేదని ఎద్దేవా చేశారు. మంత్రి ఇంట్లోనే టీడీపీ, బీజేపీ ఉందని, అభివృద్ధి చేస్తే సహకరిస్తామన్నారు.

➡ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, సీనియర్ కార్పొరేటర్ సిట్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ కౌన్సిల్‌కు తెలియజేయకుండా కమిషనర్ 200 కార్మికులను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. గతంలో పనిచేసిన కార్మికులు 90 మంది ఉన్నారని, వారంతా పనిచేసినట్లు మస్టర్‌లో పేర్లు ఉన్నాయన్నారు.

➡ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక మాట్లాడుతూ పాత కార్మికులను కాదని, మంత్రి సిఫార్సు చేసిన 200 మంది కార్మికులను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహారెడ్డి మాట్లాడుతూ.. గత నెల 16న మురుగు కాల్వల పనుల కోసం తాత్కాలిక పద్ధతిన 200 మందిని తీసుకోవాలని కౌన్సిల్‌లో చర్చించామన్నారు. అయితే తెలుగుదేశం నాయకులు, ఎమ్మెల్యేలు ఒత్తిడి చేసి తమ వారినే తీసుకోవాలని చెప్పడం తగదన్నారు. దీన్ని ఒప్పుకోబోమన్నారు. పాతవారినే కొనసాగించాలని తీర్మానం రూపొందిస్తామన్నారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఎండుతున్న ఆశలు!

- ఎండల తీవ్రతకు దెబ్బతిన్న 50 శాతం పైర్లు
- జిల్లాలో జూన్ 15 నుంచి వర్షాభావ పరిస్థితులే
- అన్ని మండలాల్లోనూ లోటు వర్షపాతం
- 1.05 లక్షల హెక్టార్లలో భూములు బీళ్లు
- ప్రత్యామ్నాయ పంటలకు విత్తనం కరువు

వరుణుడు కరుణించడం లేదు.. సరైన వర్షాలు కురవడం లేదు. ఎండలు మండిపోతూ పంటలు వాడుముఖం పడుతున్నాయి. వాతావరణంలో నెలకొన్న విచిత్ర పరిస్థితులతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. కొన్ని ప్రాంతాల్లో పైర్లను కాపాడుకోలేక వదిలేయాల్సి వస్తోంది.



చిప్పగిరి మండలం నేమకల్లులో ఎండిపోయిన వేరుశనగ

కర్నూలు (అగ్రికల్చర్): జడివానలు కురవాల్సిన జూలై నెల తేలికపాటి వానలకే పరిమితమైంది. జూన్‌లోనూ అంతంతమాత్రమే వర్షం కురిసింది. ఆగస్టులో పక్షం రోజులు గడిచినా ప్రత్యామ్నాయ పంటలు సాగుకు కూడా సరైన వర్షాలు లేవు. వర్షాభావ పరిస్థితులపై జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించినా స్పందన కరువైంది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4.19 లక్షల హెక్టార్లు ఉండగా..ఇప్పటి వరకు 3.14 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇందులో 50 శాతం పైగా పంటలు దెబ్బతిన్నాయి. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం, భూమిలో తేమశాతం పడిపోవడం, వర్షాలు లేక పోవడంతో పైర్లు పూర్తిగా ఎండిపోయాయి. ఖరీఫ్ సీజన్ మొదలై ఇప్పటికే రెండున్నర నెలలు గడిచింది. అయినప్పటికీ 1.05 లక్షల హెక్టార్ల భూములు బీళ్లుగా ఉన్నాయి. పత్తి వేయాల్సిన భూములు 53 వేల హెక్టార్లు ఖాళీగా ఉండిపోయాయి. వర్షాధారం కింద వేరుశనగ 42,298 హెక్టార్లలో సాగు సాగు చేయగా.. ఆదోని, ఆలూరు, పత్తికొండ, హాలహర్వి, పెద్దకడుబూరు, చిప్పగిరి తదితర మండలాల్లో పంట దెబ్బతినింది. అడపాదడపా అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడుతుండటంతో పంటలు కొన్ని చోట్ల పచ్చగా ఉన్నప్పటికీ ఎదుగుదల లోపించింది. ఇది దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు..

వాతావరణంలో వచ్చిన మార్పులతో వారం రోజులుగా ఎండలు తీవ్రత పెరిగింది. ఉక్కపోత ఎక్కువ కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల వరకు నమోదు అవుతుండటంతో భూమిలో ఉన్న అంతంతమాత్రం తేమ ఆవిరైపోతోంది. ఎండల తీవ్రతతో క్లైడుటే వర్షాధారం కింద సాగు చేసిన పంటలు దెబ్బతింటున్నాయి. వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం, సజ్జ తదితర పంటలు మాడిపోతున్నాయి.

చేయూత కరువు

జిల్లాలో 1.05 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాల్సి ఉంది. అయితే ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం దృష్టి సారించలేదు. రైతులకు పొద్దుతిరుగుడు, కొర్ర, జొన్న, ఉలవలు.. తదితర విత్తనాలు ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం ఏటా సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందించేంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పటి వరకు దానిపై విధివిధానాలు రూపొందించలేదు. పంటల బీమాపై కూడా స్పష్టత లేకపోవడం ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. గత ఏడాది రబీకి సంబంధించి జిల్లాలో 18 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఇన్‌పుట్ సబ్సిడీ రాలేదు. ప్రభుత్వం నుంచి చేయూత కరువవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగు ఇలా ఉంది...

పంట పేరు	సాధారణసాగు	సాగు అయింది
పత్తి	2,43,689	1,90,076
వరి	12,771	707
మొక్కజొన్న	4,652	3,502
కొర్ర	1,684	4,346
కంది	25,557	31,118
వేరుశనగ	58,969	42,672
ఆముదం	9,231	8,514
మిరప	29,998	13,482
ఉల్లి	15,698	9,817
సజ్జ	3,639	4,777
టమాట	2,606	1,508
ఇతర పంటలు	10,727	3,805
మొత్తం	4,19,221	3,14,324

ఖరీఫ్‌లో వర్షపాతం వివరాలు..

నెల	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం	తేడా(శాతంలో)
జూన్	77.7	140.0	80.2
జూలై	90.7	56.7	-37.5
ఆగష్టు	116.2	50.6	-56

మొక్కజొన్న పంట పనికి రాకుండా పోయింది



మాకు 10 ఎకరాల పొలం ఉంది. ఇందులో రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాం. ఇది ప్రస్తుతం పొట్టదశలో ఉంది. ఇప్పటి వరకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాం. కీలకమైన తరుణంలో వర్షాలు లేకపోవడంతో పంట దెబ్బతినింది. ఐదు ఎకరాల్లో కంది వేశాం. వారం రోజుల్లో వర్షం లేకపోతే అది కూడా పోయినట్లే. మరో రెండున్నర ఎకరాలు వర్షాలు లేకపోవడంతో ఖాళీగా ఉంచుకున్నాం. ప్రభుత్వం నుంచి చేయూత లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– వెంకటస్వామి, లక్ష్మీపురం, కల్లూరు మండలం

పంటలను బెట్ట నుంచి కాపాడుకోవాలి



ఖరీఫ్ సీజన్‌లో 1.05 లక్షల హెక్టార్లలో భూములు ఖాళీగా ఉన్నాయి. ఇందులో కొంత మేర పొగాకు సాగు కానుంది. ఈ నెల చివరి వరకు కందిలో స్వల్పకాలిక రకాలు సాగు చేసుకోవచ్చు. సెప్టెంబరులో వర్షాధారం కింద జొన్న, ఉలువలు వేసుకోవచ్చు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. పంటలను తాత్కాలికంగా బెట్ట నుంచి కాపాడుకునేందుకు పొటాషియం నైట్రేటు 5 గ్రాములు లేదా డీఏపీ 20 గ్రాములు లేదా 19-19-19 ఎరువు 10 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కలు బాగా తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలి.

– సుజాతమ్మ, ప్రధాన శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం, కర్నూలు

క్లుప్తంగా

అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య


మృతి చెందిన మాదిగ సువర్ణ

కృష్ణగిరి: అప్పుల బాధతో ఓ మహిళా రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పందిర్లపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. కృష్ణగిరి ఎస్‌ఐ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాదిగ పాండు, సువర్ణ(39) దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ వీరు జీవనం సాగిస్తున్నారు. కుమార్తె పెళ్లి, కుటుంబ, వ్యవసాయ ఖర్చుల నిమిత్తం దాదాపుగా రూ.8 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ నెల 15న తమ పొలానికి వెళ్లిన భార్యాభర్తలు పంటలకు వచ్చిన డబ్బులు వడ్డీలకే సరిపోతున్నాయని బాధపడ్డారు. ఈ క్రమంలో సువర్ణ మిరప నారుకు నీరు పెట్టేందుకు బావి దగ్గరకు పోయి అక్కడే ఉన్న పురుగుల మందు తాగింది. భార్య ఎంతకూ రాలేదని గమనించి పాండు బావి దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే ఆమె అపస్మారకస్థితిలో ఉంది. కుటుంబసభ్యుల ద్వారా డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గురువారం రాత్రి పొద్దుపోయాక సువర్ణ మృతి చెందారు. మృతురాలి తల్లి చిట్యాల గ్రామానికి చెందిన గూటుపల్లి మాదిగ కేశమ్మ ఫిర్యాదు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


మృతదేహాన్ని తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్యాపిలి: చంద్రపల్లి గ్రామంలో శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడు (71) మృతి చెందాడు. కాషాయం దుస్తులు ధరించిన వృద్ధుడు గత వారం రోజులుగా చంద్రపల్లిలో భిక్షాటన చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు గమనిసించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. పంచాయతీ సెక్రటరీ కిరణ్, వీఆర్వో పురుషోత్తం ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది వృద్ధుడి అంత్యక్రియలు నిర్వహించారు.

అరటి తోటలో కొండచిలువ


కొండచిలువతో స్నేక్ క్యాచర్ మోహన్

ఆత్మకూరు: మహానంది వెళ్లే మార్గంలోని శ్రీనగరం సమీపంలో ఉన్న అరటి తోటలో శుక్రవారం పొడవైన కొండచిలువ కలకలం రేపింది. పొలం పనుల్లో భాగంగా వెళ్లిన వ్యవసాయ కూలీలు అరటిచెట్ల సారుగు(పట్టలు) మధ్యన ఉన్న కొండచిలువను చూసి భయంతో పరుగులు తీశారు. వెంటనే వారు సమీపంలోని అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించారు. అతను కొండచిలువను పట్టుకుని నల్లమలలో వదిలేశాడు.

‘గులాబీ’ పురుగును నివారించుకోండి

ఆదోని రూరల్: పత్తి పంటకు సోకే గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఏబీసీ (సౌంత్ ఏసియా బయోటెక్నాలజీ సెంటర్) ప్రెసిడెంట్ డాక్టర్ భగీరథ చౌదరి, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని బైచిగేరి గ్రామంలోని పత్తి పంటను వారు పరిశీలించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ కె.రాఘవేంద్రచౌదరి, శాస్త్రవేత్త మోహన్‌విష్ణువర్ధన్, నంద్యాల శాస్త్రవతేత్తలు భరద్వాజ్, డీఆర్‌సీ ఎం.గిరీష్, ఏడీఏ అరుణకుమారి, ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


విద్యుద్దీప కాంతులతో శ్రీమఠం


బంగారు కాంతుల్లో శ్రీమఠం కారిడార్

పూజ్యాయ.. రాఘవేంద్రాయ

- రేపటి నుంచి సద్గురు 353వ ఆరాధన మహోత్సవాలు
- 18వ తేదీ నుంచి 24 వరకు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


రాములోరి సంస్థాన పూజలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు (ఫైల్)


రాఘవేంద్రుల మూల బృందావనం

మంత్రాలయం: వేదభూమిలో సశరీరంగా చింతామణి సదృశ్యులైన శ్రీరాఘవేంద్రుల 353వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో ఏడు రోజుల పాటు వేడుకలు వైభవంగా జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి దాదాపు రెండు లక్షలకు పైగా భక్తుల తరలివచ్చి వేడుకల్లో తరించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే వేదభూమి విద్యుద్దీప కాంతులతో కాంతులీనుతోంది. రోజూ రాయరు రథోత్సవాలతోపాటు రాములోరి సంస్థాన పూజలు ఉంటాయి. భక్తుల కోసం యోగీంద్ర మంటపంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఉత్సవ విశేషాలు

- ఆదివారం ఉత్సవాలు ప్రారంభోత్సవంలో భాగంగా ధ్వజారోహణ, ధాన్యపూజ, గోవు, తురగ పూజ ఉంటాయి. ఉదయం తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టువస్త్రాల సమర్పణ ఉంటుంది.
- సోమవారం శాఖోత్సవం, రజత మంటపోత్సవం చేపడతారు.
- మంగళవారం పూర్వారాధన సందర్భంగా సింహవాహనంపై ప్రహ్లాదరాయల ఊరేగింపు ఉంటుంది. సాయంత్రం యోగీంద్ర మంటపంలో ప్రముఖులకు అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రదానం చేస్తారు.
- బుధవారం మధ్యారాధన పురస్కరించుకుని రాఘవేంద్రుల మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేస్తారు. రాత్రి గజవాహనోత్సవం తోపాటు రజత, సువర్ణ రథోత్సవాలు ఉంటాయి. మహా రథోత్సవం, వసంతోత్సవం జరుపుతారు.
- గురువారం ఉత్తరారాధన సందర్భంగా క్షేత్రంలో రాఘవేంద్రుల మహా రథోత్సవం అంగరంగ వైభవంగా చేపడతారు. హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపిస్తారు.
- శుక్రవారం పూర్వపు పీఠాధిపతి సుజ్ఞానేంద్రుల ఆరాధన, అశ్వవాహన సేవలు ఉంటాయి.

ఏర్పాట్లు ఇలా..

ఉత్సవాల సందర్భంగా వచ్చే భక్తుల సౌకర్యార్థం అధికారులు పలు ఏర్పాట్లు సిద్ధం చేశారు. భక్తుల కోసం ఐదు లక్షల పరిమళ ప్రసాదాలు తయారు చేశారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు అన్నపూర్ణ భోజనశాల, నదీతీరం, సీఆర్వో కార్యాలయం, 200 గదుల సముదాయంతో శౌచాలయాలు ఏర్పాటు చేశారు. అలాగే 100 రెడీమెడ్ టాయిలెట్స్ అందుబాటులోకి తీసుకురానున్నారు. తుంగభద్ర నదిలో వరద నీరు ఉధృతంగా పారుతుండటంతో పుణ్య స్నానాలకు ప్రత్యేక షవర్లు ఉన్నాయి. మఠం సీఆర్ఓ, ప్రధాన ముఖద్వారం, మఠం ప్రాకారం, అన్నపూర్ణ భోజనశాల దారిలో వాటర్ ప్లాంట్లు నెలకొల్పారు. పీఠాధిపతుల కోసం ఈ ఏడాది నూతనంగా గురు నివాస్, మధ్వమార్గ్ కారిడార్ నిర్మించారు.

- శనివారం సర్వ సమర్పణోత్సవంలో భాగంగా బంగారు పల్లకీ, చెక్క, వెండి, బంగారు రథోత్సవాలు ఉంటాయి.

అనుగ్రహ ప్రశస్తి అవార్డుల ప్రదానం

ఆనవాయితీలో భాగంగా శ్రీరాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రదానం చేయనున్నారు. మైసూరు రాజవంశీకులు, పార్లమెంట్ సభ్యుడు యదువీర్ కృష్ణదత్త ఛామరాజేంద్ర వడియార్ ప్రత్యేక అతిథిగా వచ్చి ప్రశస్తి అవార్డు స్వీకరించనున్నారు. అలాగే బీజీఎస్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశనాథ స్వామిజీ, విద్వాన్ రఘుపతి ఉపాధ్యాయ, ప్రొఫెసర్ వజ్ర భూషణ్ ఓజాకు అవార్డు అందజేయనున్నారు. ఉత్సవాల్లో ఏర్పాట్లను మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్‌జోషి, మేనేజర్-3 శ్రీపతిఆచార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ కోనాపూర్, పీఆర్వో నరసింహామూర్తి పర్యవేక్షించనున్నారు.

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లు ఆదా


సమావేశంలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నుంచి ఐదు రోడ్ల కూడలిలోని పవర్‌హౌస్‌లో కర్నూలు డివిజన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా ఇంటికప్పుపై కనీసం 10 చ.మీ/100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం రూ.1000 వస్తున్న విద్యుత్ బిల్లు ఒక కిలోవాట్ సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకున్న తర్వాత రూ.338 వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. ఏడాదికి ఆదా రూ.8వేల వరకు ఉంటుందని, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు అవకాశమన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ రాయితీ రూ.30 వేల నుంచి రూ.78 వేల వరకు ఉంటుందన్నారు. సమావేశంలో ఈఈ శేషాద్రి, ఏడీఈలు నాగప్రసాద్, రాజేంద్రబాబు పాల్గొన్నారు.

వర్షంలో ‘రైతన్న కష్టం’


తడిచిన వేరుశనగకాయలను నింపుతున్న హమాలీలు

ఆదోని అర్బన్: అరగంట వర్షం ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో అల్లకల్లోలం సృష్టించింది. దిగుబడులు అమ్మకానికి తెస్తే రైతుల కష్టం నీటిపాలైంది. శుక్రవారం కురిసిన తేలికపాటి వర్షానికే యార్డులో విక్రయానికి తీసుకొచ్చిన వేరుశనగకాయల దిగుబడులు తడిచి ముద్దవడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు శుక్రవారం 158 మంది రైతులు 5,711 సంచుల్లో 2వేల క్వింటాళ్ల వేరుశనగకాయల దిగుబడులను అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటా గరిష్ట ధర రూ.7,329, మధ్య ధర రూ.6,480, కనిష్ట ధర రూ.3469 నమోదైంది. బోరుబావులకు సంబంధించిన వేరుశనగకాయల దిగుబడులు కావడంతో ఎండకు బయట ఉన్న ప్లాట్ ఫారంపై ఆరబోశారు. అయితే మధ్యాహ్నం అరగంట సేపు ఎడతెరిపిలేని వర్షం కురవడంతో దిగుబడులన్నీ తడిచి ముద్దయ్యాయి. కొంత దిగుబడి కొట్టుకుపోయింది. ఈ మార్కెట్ గతంలో రెండో ముంబయిగా పేరుగాంచింది. కోట్లలో ఆదాయం ఉన్నా అభివృద్ధిలో వెనుకబడింది. కనీసం కాలువల్లో చెత్తాచెదారం తొలగించకపోవడంతో చిన్న వర్షానికే దుకాణాల ముందు వర్షం నీరు నిలిచి రైతులకు తీరని నష్టం మిగిల్చింది. ప్లాట్‌ఫాంలు సరిగా లేకపోవడం కూడా దిగుబడులు తడిచిపోయేందుకు కారణమైంది. యార్డులో టార్పాలిన్లు లేకపోవడం వల్ల కూడా రైతులు దిగుబడులను కాపాడుకోలేకపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

60 సంచుల వేరుశనగ దిగుబడులు కొట్టుకుపోయాయి



మూడు ఎకరాలకు 60 సంచుల వేరుశనగకాయల దిగుబడి వచ్చింది. అమ్మకానికి ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చాను. తేలికపాటి వర్షానికి దిగుబడి అంతా నీటిలో తడిచి కొట్టుకుపోయింది. దాదాపు రూ.2 లక్షలు నీటిపాలయింది. ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారు. ప్రభుత్వం, యార్డు అధికారులే న్యాయం చేయాలి.

– అబ్దుల్లారహమాన్, ఎరిగేరి, కర్ణాటక రాష్ట్రం

బెటాలియన్స్ రేంజ్-3 డీఐజీగా సీతారాం


నూతన డీఐజీకి బొకే అందజేస్తున్న ఇన్‌చార్జ్ కమాండెంట్ ప్రభుకుమార్

కర్నూలు: ఏపీఎస్పీ బెటాలియన్స్ కర్నూలు రేంజ్-3 డీఐజీగా నియమితులైన పి.సీతారాం విధుల్లో చేరారు. ఇక్కడున్న సీహెచ్ వెంకటేశ్వర్లు ఈ ఏడాది మేలో పదవీ విరమణ పొందారు. దీంతో సీతారాంను కర్నూలుకు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈయన ఆర్ఎస్ఐ హోదాలో 1991లో ఏపీఎస్పీ బెటాలియన్స్ విభాగంలో విధుల్లో చేరారు. అప్పటి నుంచి డీఐజీగా పదోన్నతి పొందే వరకు గ్రేహౌండ్స్‌లోనే బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఆయన కర్నూలు చేరుకుని బాధ్యతలు చేపట్టిన అనంతరం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కర్నూలు రెండవ బెటాలియన్‌లోని పరిపాలనా విభాగం కార్యాలయాన్ని సందర్శించారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కర్నూలు బెటాలియన్‌కు చెందిన కంటింజెంట్ సిబ్బంది కవాతులో పాల్గొని ప్రతిభ కనపరచినందుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ద్వితీయ బహుమతి అందుకున్నారు. కప్పును నూతన డీఐజీ సీతారాంకు అందజేయడంతో ఆయన వారిని అభినందించారు. ఇన్‌చార్జి కమాండెంట్ కె.ప్రభుకుమార్, సహాయ కమాండెంట్లు మహబూబ్ బాషా, కేశవరెడ్డితో పాటు ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పటాలం సిబ్బంది నూతన డీఐజీకి స్వాగతం పలికారు.


అవస్థలు ‘ఉచితం’

- ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతం సేవలో భక్తులకు ఇక్కట్లు
- ఏర్పాట్లు కల్పించడంలో దేవస్థాన అధికారుల విఫలం


చంద్రవతి కల్యాణ మండపం వద్ద స్పృహ కోల్పోయిన భక్తురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం అధికారులు నిర్వహించిన ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం సేవ కార్యక్రమంలో భక్తులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. శ్రావణ రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించింది. చాలా మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా ఉచిత సేవకు టికెట్లు పొందారు. ఆ టికెట్లులో వరలక్ష్మీవ్రతం టైం స్లాట్ ఉదయం 8 గంటలుగా నమోదు అయింది. దీంతో భక్తులు ఉదయం 7 గంటలకే భక్తులు చంద్రవతి కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. అయితే 9.30 గంటల వరకు భక్తులకు కల్యాణ మండపంలోకి అనుమతించ లేదు. కల్యాణ మండపం వద్ద భక్తులకు కనీస సౌకర్యాలైన తాగు నీరు, భక్తులు కూర్చునేందుకు సౌకర్యాలు కల్పించలేదు. దీంతో 2.30 గంటల పాటు కల్యాణ మండపం బయట పడిగాపులు కాయాల్సి వచ్చింది. అలాగే ఆన్‌లైన్ టికెట్లు స్కానింగ్ కోసం ఒక్క కౌంటర్ మాత్రమే ఏర్పాటు చేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది భక్తులు గంటల తరబడి నిలబడలేక స్పృహ కోల్పోయారు. ఈ విషయమై దేవస్థాన అధికారులను వివరణ కోరగా ఆన్‌లైన్ టికెట్‌పై 9.30 గంటలకు వరలక్ష్మీవ్రతం ప్రారంభిస్తున్నట్లు సూచించామన్నారు.

జగజ్జననీ నమోస్తుతే!


అమ్మవారికి తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వరలక్ష్మీ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని దిగువ అహోబిలంలో కొలువైన మూలమూర్తి శ్రీ అమృతవల్లీ అమ్మవారికి ఉదయం నిత్యపూజల అనంతరం ఉత్సవమూర్తి శ్రీదేవి అమ్మవారిని దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచారు. నవకళశ స్థాపన అనంతరం పంచామృతాలతో అభిషేచించి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తి అమృతవల్లీ అమ్మవారిని వరలక్ష్మీ అమ్మవారిగా అలంకరించి వేద పండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ముత్తయిదువల ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి అమ్మవారికి మాడ వీధుల్లో వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు.

విద్యాబుద్ధులు ప్రసాదించు తల్లీ!


సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ‘విద్యా వరప్రదాయిని మా చిన్నారులకు విద్యా బుద్ధులు ప్రసాదించు తల్లీ’.. అంటూ కొలనుభారతీ క్షేత్రంలో భక్తులు ప్రణమిల్లారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు వారి చిన్నారులకు కొలనుభారతి సన్నిధిలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ క్షేత్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తే భవిష్యత్తు ప్రజ్వలిస్తుందని, మంచి విద్యాబుద్ధులు ప్రాప్తిస్తాయని, ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని భక్తుల నమ్మకం. దీంతో పురోహితులు చక్రపాణి శర్మ చిన్నారులకు బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. 57 మంది భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీవ్రతం


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

చౌడేశ్వరిదేవికి అభిషేకం నిర్వహిస్తున్న అసిస్టెంట్ కమిషనర్, వేద పండితులు

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, గ్రామ పెద్దలు, ప్రజలు, వేదపండితులు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి కుంకుమార్చన చేపట్టారు. అనంతరం ముత్తైదువులతో వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.